క్లుప్తంగా

నేడు సబ్బవరంలో వైఎస్సార్ జయంతి వేడుకలు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో దివంగత మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. మండలంలోని పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాల్సిందిగా పిలుపునిచ్చారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

గిరి ప్రదక్షిణలో బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

సింహాచలం: ఈ నెల 9న జరిగే గిరి ప్రదక్షిణలో పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రత్యేకంగా మరుగుదొడ్లు, పిల్లల వైద్య నిపుణులతో కూడిన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వారికి సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. దారిపొడవునా ఎన్జీవోల సమన్వయంతో బాలల హక్కుల చట్టాలపై, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా చూడాలన్నారు. సింహగిరిపై స్వామివారి దర్శనం కోసం బాలలకు, గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక క్యూలు, వేడిపాలు, బిస్కెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం అధికారులకు సంబంధిత లేఖను పంపించినట్లు పేర్కొన్నారు.

శిక్షణ



బీఎల్‌వోల శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న తహసీల్దార్ సంతోష్‌కిరణ్

పెందుర్తి: భారత ఎన్నికల సంఘం, ఐఐడీఈఎం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులకు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎ.సంతోష్‌కిరణ్ మాట్లాడుతూ ఓట్ల నమోదు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. ఓటు హక్కు వయసు వచ్చిన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో చేరేలా అవగాహన కల్పించాలని చెప్పారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు, అధికారులు, పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడ మండలాల నుంచి బీఎల్‌వోలు హాజరయ్యారు.

వినతి



ఎంఈవో రవీంద్ర బాబుకు వినతి పత్రం అందిస్తున్న ఎండీఎం కార్మికులు

సబ్బవరం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని మండలంలోని ఏపీ ఎండీఎం పథకం కార్మికులు డిమాండ్ చేసారు. ఈ మేరకు ఈ నెల 9న జరిగే అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెలో పాల్గొనున్నట్లు తెలియజేస్తూ స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో రవీంద్రబాబుకు వినతిపత్రం అందించారు. ఎండీఎం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి కనీసం రూ.20 చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, వంట చేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైనవారికి రూ.20 లక్షల నష్ట పరిహారం అందించాలన్నారు. కేంద్రీకృత వంట శాలల్ని నిషేధించాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో సిటు సభ్యులు ఉప్పాడ సత్యవతి, ఎస్ గౌరి, ఎం.గౌరేష్, పుర్రి లక్ష్మి, జి.గణపతి, కె.ఆదిలక్ష్మి, నారాయణమ్మ, ఎన్.వెంకటలక్ష్మి, గండి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన



మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండి పట్టుదలతో చదువుకుని అత్యుత్తమ స్థాయికి ఎదగాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేటికాలంలో విద్యార్థులు డ్రగ్స్, మద్యం లాంటి వ్యసనాలకు బానిసలు కావడం దురదృష్టకరమన్నారు. ఈవ్ టీజింగ్, మహిళలపై నేరాలకు పాల్పడటం ద్వారా జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని, లేకుంటే ఆయా నేరాల్లో కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ భాస్కరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణమయ్య సంకీర్తనా జయంతి



అప్పన్న ఆలయ బేడా మండపంలో కృష్ణమయ్య విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం: ఆషాఢ ద్వాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉన్న శ్రీకాంత కృష్ణమాచార్యులు(కృష్ణమయ్య) విగ్రహం వద్ద దేవస్థానం అర్చకులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. షోడషోపచార పూజలు జరిపి, విశేష హారతులిచ్చారు. కృష్ణమయ్య సంకీర్తలను స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆలపించారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. తిరుమల అన్నమాచార్యుల వలే సింహాచల క్షేత్రంలో కృష్ణమయ్య ప్రసిద్ధి. సింహాద్రినాథుడిపై ఆయన చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారు. ఆ సంకీర్తనలు రచించిన రోజు ఆషాఢ ద్వాదశి కావడంతో ఏటా ఆరోజు కృష్ణమయ్య సంకీర్తనల జయంతిని నిర్వహిస్తుండటం పరిపాటి.

షెడ్ కూలిన ఘటనలో దేవస్థానానిదే బాధ్యత



షెడ్ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

సింహాచలం: గిరి ప్రదక్షిణ సందర్భంగా సింహాచలంలోని కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక షెడ్ కూలిన ఘటనలో దేవస్థానానిదే పూర్తి బాధ్యతని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. షెడ్ కూలిన ప్రదేశాన్ని సోమవారం ఆయన పరిశీలించి, దేవస్థానం అధికారుల తీరుపై మండిపడ్డారు. దేవస్థానం ఈవో, ఈఈలు, డీఈలు, ఏఈలతో సహా డిప్యుటేషన్‌పై పలువురు ఇంజినీర్లు గిరి ప్రదక్షిణ ఏర్పాట్లలో ఉన్నా నిర్మాణ సమయంలోనే షెడ్ కూలిపోవడం క్షమించరాని నేరమన్నారు. గిరి ప్రదక్షిణ రోజు షెడ్ కూలిపోయి ఉంటే ప్రమాదం ఏ స్థాయిలో ఉండేదో తలచుకుంటేనే ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆయన వెంట 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం ఉన్నారు.

సందడిగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



సాయినగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

సబ్బవరం: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సమితి నియోజకవర్గ కన్వీనర్ ఇందుగుబిల్లి గోపి, మండల కన్వీనర్ బొర్రా జయరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దండోరా జెండా ఆవిష్కరించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జండాను ఆవిష్కరించి,అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 30 ఏళ్లుగా దండోరా ఉద్యమంలో విశేష సేవలందించిన సీనియర్ నాయకులను మండల కమిటీ తరఫున ఘనంగా సత్కరించారు. మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గొటివాడ సన్యాసి, నీటిపల్లి గంగరాజు, కొమ్ము కోటి అప్పారావు, నీటిపల్లి ముత్యాలరావు, గొటివాడ సామ్రాట్ కుమార్, మారెడుపూడి కోటి, నీటిపల్లి కొండబాబు, నిమిడితల్లి చిన్నారావు, చింతాడ శాంతమ్మ, కొమ్ము జగదీష్, దువ్వి మనోహర్, కొమ్ము తాతారావు, మారెడుపూడి చంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 8 వినతులు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 8 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పికెల్‌బాల్ ఎరీనా ప్రారంభం



పికెల్ బాల్ ఎరీనాను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో విద్యార్థుల మానసిక, శారీరక వికాసం కోసం ఏర్పాటు చేసిన పికెల్‌బాల్ ఎరీనాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి కోరారు. పాఠశాలలో నాలుగు కోర్టుల సముదాయంతో ఏర్పాటు చేసిన పికెల్‌బాల్ ఎరీనా సముదాయాన్ని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం కల్పించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడా శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లివర్ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం



ఆకాష్ తల్లికి నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు లంక సత్తిబాబు

సింహాచలం: అడవివరంలో లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న గొర్లె ఆకాష్‌కు 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం మార్కెట్ అధ్యక్షుడు లంక సత్తిబాబు రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. ఆకాష్ ఇంటికి సోమవారం వెళ్లి అతని తల్లికి సంబంధిత నగదు అందించారు. ఆకాష్ త్వరగా కోలుకోవాలని అభిలషిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కంచుబోయిన సింహాద్రి, సిరిపురపు కృష్ణ, బొట్టా శ్రీను, ఎస్.అప్పారావు, శిడగం తాతబాబు, సంతు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించండి మహాప్రభో..



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్జీ పాలిమర్స్ బాధితులు

మహారాణిపేట: ఎల్జీ పాలిమర్స్‌లో గ్యాస్ లీక్ ఘటనలో నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఈ ఫిర్యాదును స్వీకరించకపోవడంతో బాధితులంతా కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో మొత్తం 186 మందికి సహాయం అందించాల్సి ఉందని, ఐదేళ్లు దాటుతున్న ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఎంతో మందికి ఇచ్చారని, ఎల్జీ పాలిమర్స్ సమీపంలోని వెంకటాపురం తదితర గ్రామాల్లో నివసిస్తున్న తమకు ఇవ్వలేదని, తక్షణం ఇవ్వాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి, గ్రామాల్లో ఉన్న వారికి రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందించారని, నేటి వరకు ఈ 186 మందికి ఎలాంటి సహాయం అందలేదని వాపోయారు. గతంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని, ఎలాంటి పరిష్కారం కాలేదని బాధితులు వివరించారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



కోన రామారావు

పరవాడ: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 8న స్థానిక పార్టీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా దివంగత మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హాజరవుతారన్నారు. మండలంలోని ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మహిళా నాయకులు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపటి సమ్మె విజయవంతానికి పిలుపు



కార్మికులతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పరవాడ: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మిక సంఘాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్రావు పిలుపునిచ్చారు. పరవాడ, లంకెలపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సమ్మె ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పు చేసే చర్యలను విరమించాలని డిమాండ్ చేశారు. లంకెలపాలెం, పరవాడ, తానాం, వాడచీపురుపల్లి, ఎన్టీపీసీ ప్రాంతాల్లో సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, పోతినాయుడు, వెంకటరావు, వెంకటస్వామి, నాయుడు, కన్నబాబు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



రహదారుల భద్రతపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీఐ జి.రామచంద్రరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లో రహదారుల భద్రతపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే యువత నిర్లక్ష్యం వల్లే ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మైనర్‌లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారినపడి తల్లిదండ్రులను కడుపుకోత మిగల్చొద్దని హితవు పలికారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపడం, మొబైల్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. రహదారుల భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి, తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి కూడా అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రా(సీహెచ్‌సీ)న్ని అన్నివిధాలా అభివృద్ధిపథంలో నిలుపుతామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎన్నికైన రాపర్తి శంకర్ ఆనంద్, బంగారు వరూధిని ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారం రోజుల్లో ఆస్పత్రిలో కీలక మార్పులు చేస్తామన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై సీఐడీతో దర్యాప్తు చేపట్టాలి

పరవాడ: ఇటీవల పరవాడలో వెలుగుచూసిన కల్తీ మద్యం ఘటనపై సీఐడీతో దర్యాప్తు జరిపించాలని పరవాడ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కల్తీ మద్యం తయారీలో నిజమైన దోషులను వదిలిపెట్టి, ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి ఎక్సైజ్ అధికారులు చేతులు దులిపేసుకున్నారని పేర్కొన్నారు. దీని వెనుక స్థానిక పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ యూత్ అధ్యక్షుడు గండి మహేష్, బి.చినఅక్కునాయుడు, వెంకటరావు, నరేష్, కె.శ్రీనివాస్, వెంకటరమణ ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.70 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.